క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు

గురజాల: సత్యసాయి ఆదిత్య ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నట్లు వీరాస్వామి గురూజీ శనివారం తెలిపారు. శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో 27వ తేదీ పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 5 గంటలకు, సాయంత్రం 6 గంటలకు క్లాసులు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది 26,353 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారని ఇప్పటి వరకు సుమారు 946 ఎకరాలలో సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన అన్నా చెల్లెళ్ల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ ఆర్థిక సాయాన్ని గ్రామ సర్పంచి బద్దూరి బుజ్జిశ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి వేమూరి హైమావతి శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చల్లా రామయ్య(32), ఆయన చెల్లెలు ఇర్ల కోటమ్మ(27) వాంతులు, విరోచనాలతో మృతి చెందారు. దీంతో ప్రభుత్వం వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా కింద ఆర్థిక సాయం మంజూరు చేసింది. తక్షణ సాయంగా కుటుంబానికి రూ.10 వేల చొప్పున సర్పంచి బుజ్జిశ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి హైమావతి పంపిణీ చేశారు. రామయ్య తండ్రి వెంకటేశ్వర్లు, కోటమ్మ కుమార్తె లక్ష్మిని నామినీలుగా గుర్తించి కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందించనున్నట్లు తెలిపారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి



వెల్దుర్తి: అటవీ సమీప గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతాన్ని, వన్యప్రాణులను కాపాడుకోవటంలో ముఖ్యపాత్ర పోషించాలని మార్కాపురం డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. మండలంలో అటవీ ప్రాంతానికి సమీపంలోని పిచ్చయ్యబావి తండా గ్రామస్తులకు సోలార్ సిస్టమ్‌ను శుక్రవారం అందించారు. ఆయన మాట్లాడుతూ అటవీశాఖ సిబ్బందితో పాలు పంచుకొని అటవీని కాపాడాలని, పర్యావరణ పరిరక్షణకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అటవీ ప్రాంతంలోని పిచ్చయ్య బావి తండాలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ప్రజలు కోరటంతో సోలార్ సిస్టంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారి ఏవీ నీలకంఠేశ్వరరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, బీటు అధికారి కె.గోపీచంద్ పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలి..



గురజాల: శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. స్థానిక నగర పంచాయతీలోని శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయం నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరూ ఆనందంగా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. అనంతరం డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాదికారి గణపతి సురేష్, కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ, కమిటీ సభ్యులు రెంటాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధుడికి ట్రైసైకిల్ అందజేత



పిడుగురాళ్ల: వృద్ధుడికి శరణ్య సపోర్టు ట్రస్ట్ సభ్యులు ట్రైసైకిల్‌ను శుక్రవారం అందజేశారు. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన దాసరి వేణు దంపతులు వృద్ధాప్యంతో పని చేసుకోకుండా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రైసైకిల్ అందించినట్లు ట్రస్ట్ సభ్యులు సీహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఏఎస్‌ఎం కరిమునిసా, వెల్ఫేర్ రామకృష్ణ, నిరంజన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

మాచర్ల: శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆయా అమ్మవారి దేవాలయాలలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆయా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వాహించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవార్ల దేవాలయాలను దర్శించుకున్నారు. పాత మాచర్లలో వేంచేసియున్న వాసవి కన్యక పరమేశ్వరి, సొసైటీ కాలనీలోని మాతా అన్నపూర్ణేశ్వరి అమ్మవారు, చంద్రవంక బ్రిడ్జిక్రింద ఆదిలక్ష్మి, కేసీపీకి వెళ్ళే రహదారిలో కనకదుర్గ, 13వ వార్డులోని కనక దుర్గ, పత్తి ఫ్యాక్టరీ ఆవరణలోని శ్రీ సత్యసాయి మందిరంలో శ్రీలలిత, గాయత్రి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేకంగా అలంకరణ చేయగా, మూల విరాట్‌లు భక్తులకు ఆయా అలంకరణలో దర్శనమిచ్చారు.

భక్తి శ్రద్ధలతో శుభాలనొసగే..

రెంటచింతల: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పూజలు, నోములు, వ్రతాలు చేయడంతో మండలంలోని వివిధ గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు అమ్మవారి దేవాలయాలలో భక్తులు శుభాలనొసగే వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రధాన అర్చకులు శిష్టి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు అనీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా మహిళలు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు.



దాచేపల్లిలో వరలక్ష్మీ వ్రతంలో భక్తులు



జనార్థనపురంలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

ఆలయాల్లో పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా మండల వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయం, శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు అందించారు.

ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాలుగు గుడి దేవస్థానంలోని మహాసరస్వతి అమ్మవారిని రూ.3 లక్షల విలువైన నోట్లతో ధనలక్ష్మీ అలంకరణ చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. శ్రావణ మాసం శుక్రవారం కావటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా పట్టణంలోనిక భవానీ నగర్‌లోని కనక దుర్గ అమ్మవారిని ధనలక్ష్మీ అలంకరణ చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు.

గురజాలలో..

గురజాల: శ్రావణ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతంను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిలో వరలక్ష్మీ ప్రతిమను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా దేవాలయాల్లో కూడా మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని జనార్ధనపురంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో వరలక్ష్మీ అమ్మవారి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



దాచేపల్లిలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



పాత మాచర్లలో.. అమ్మవారి మూలవిరాట్



రెంటచింతలలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి



ధనలక్ష్మీ అలంకరణలో మహాసరస్వతి అమ్మవారు

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా జాకీర్‌హుసేన్

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నారాయణపురానికి చెందిన షేక్ జాకీర్‌హుసేన్ నియమితులయ్యారు. అదే విధంగా మండలంలోని శ్రీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ మహిల నేత వంగా పద్మావతి జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన జాకీర్‌హుసేన్‌ను జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, మాజీ సర్పంచి బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి దాచేపల్లి సైదారావు, నాయకులు చింతల దానియేలు, కొలా జంపాలరెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, షేక్ సైదా, నాళం శ్రీనివాసరావు తదితరులు శుక్రవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో సన్మానించారు.



జాకీర్‌హుసేన్‌ను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో రాయల మధు

దుర్గి: జిల్లా వైఎస్సార్ సీపీ కమిటీలో మండలం పరిధిలోని అడిగొప్పల గ్రామానికి చెందిన రాయల మధుకు స్థానం దొరికింది. శుక్రవారం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియామక పత్రాన్ని అందుకున్నారు. 2014 నుంచి పార్టీ కార్యకర్త పనిచేస్తూ క్రియాశీలకంగా వ్యవహరించాడు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సా ర్‌సీపీ యువజన విభాగంజోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు మండల పార్టీ గ్రామ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



రాయల మధు



జినరసింహారెడ్డి

గుర్తు తెలియని మృతదేహం

మాచర్ల: పట్టణంలోని సాగర్ రోడ్డులో గొర్రెల మండి ప్రాంతంలో గురువారం రాత్రి గుర్తు తెలియని శవం ఉన్నట్లు పోలీసులు గుర్తించి, మృతదేహాన్ని పరిశీలించారు. ఆచూకీ లభించలేదు. అర్ధరాత్రి సమయంలో ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలించారు. ఈ మృతదేహం అనాధగా పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా సమాచారం తెలిస్తే తెలియజేయాలని హెడ్‌కానిస్టేబుల్ సముద్రాల కోటేశ్వరరావు కోరారు.

బాలురకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

రెంటచింతల: బాలుర వాహనాలు నడిపితే వారిపైన, వాహనాలు నిచ్చిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఓవర్ లోడింగ్, నియమ నిబంధనలు పాటించని 10 మంది వాహన దారులపై కేసులు నమోదు చేసి రూ.1,350 అపరాధ రుసుం వసూలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వారిని లైసెన్స్‌లేని వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

గురజాల: విద్యుదాఘాతంతో యువకుడు గాయపడిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని పల్లెగుంతలో పొలంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా పల్లెగుంత గ్రామానికి చెందిన కరుణాకర్‌కు విద్యుత్ షాక్ గుర్కై కింద పడిపోయాడు. వెంటనే కరుణాకర్‌ను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడులో బొడ్రాయి ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం 4వ రోజు ఘనంగా నిర్వహించారు. పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు ఆశ్రమ సిద్ధాంతి పోతునూరి శివరామచారి ఆధ్వర్యంలో 11 మంది వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి. గ్రామంలో సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 500 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట వెంకయ్య, గ్రామ సర్పంచి అనసూర్యమ్మ, ఎంపీటీసీ మంగమ్మ, మాజీ సర్పంచులు పార్లపల్లి పెద గాలయ్య, గార్లపాటి వెంకటరామయ్య, తోట బ్రహ్మయ్య, తోట వెంకటేశ్వర్లు, అనిశెట్టి సుబ్బయ్య, గుర్రాల మల్లయ్య, రామిరెడ్డి, నారపరెడ్డి, ఐతంరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా

- ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల ఆపరేషన్లు
- త్వరలో ప్రారంభం కానున్న పోస్ట్ ఆపరేషన్ వార్డు
- ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: ప్రభుత్వం వైద్యశాలలో చిన్న చిన్న వ్యాధులకు అవసరమైన అన్ని రకాల ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ బి.లక్ష్మణరావు పేర్కొన్నారు. సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో కొత్తగా మొదలైన జనరల్ ఆపరేషన్స్‌పై శక్రవారం వైద్యశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు చొరవతో సేవలు విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. ఇంతకు ముందు కేవలం గర్భిణుల ఆపరేషన్లు మాత్రమే ఇక్కడ జరిగేవని ఇప్పుడు అన్ని రకాల ఆపరేషన్‌లు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ అవసరం ఉన్న రోగులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలోని సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రైవేట్ వైద్యశాలలకు వేలకు వేలు అయ్యే ఖర్చు ఇక్కడ పూర్తి ఉచితంగానే చేస్తున్నారని దీనికి సంబంధించి పోస్ట్ ఆపరేషన్ ప్రత్యేక వార్డుని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ సర్జన్ డాక్టర్ సుష్మ మాట్లాడుతూ ఈ నెల 28 ఆపరేషన్లు మన ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించామని, గత నెల 26 ఆపరేషన్లు చేశామని వెల్లడించారు. సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పుడు మనకి ఇద్దరు జనరల్ ఎండి సర్జన్స్ అందుబాటులో ఉన్నారని, కావాల్సిన సౌకర్యాలు కూడా అందిస్తున్నామన్నారు. వివిధ రుగ్మతలతో బాధపడే రోగులు ఈ అవకాశాన్ని అవసరం ఉన్నవారు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సురేష్, ఏవో భవాని, ఆర్ఎంఓ శోభారాణి పాల్గొన్నారు.



గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ పూజలు



కండ్లకుంటలోని గంగమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న పీఆర్ దంపతులు

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంటలోని గంగమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి దంపతులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచి పిన్నెల్లి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి వెంకటలక్ష్మారెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, బుజ్జి, ఈడెబోయిన వెంకయ్య, నర్రావుల అయ్యన్న, జంగిలి శ్రీనివాసరావు, మోదుగుల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ బోనాల ఉత్సవం



ఆలయం వద్ద కుంకుమ బండ్లు, అమ్మవార్లకు బోనాలు సమర్పించడానికి తరలివచ్చిన మహిళలు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో కొలువై ఉన్న పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి, పాత పాటేశ్వరమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవార్లకు సంప్రదాయక పూజాధికాలు నిర్వహించి భక్తుల సదర్శనార్థం అలంకారాలు చేశారు. ఈ రోజు నుంచి శ్రావణ మాసం ముగిసే వరకు అమ్మవార్ల గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలు వంతుల వారీగా బోనాల పండుగను నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం మహిళలు బోనాలతో సామూహికంగా మేళతాళాలతో ఆలయాలకు చేరుకుని అమ్మవార్ల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు పోతురాజుకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కుంకుమ బండ్లు కట్టి అమ్మవార్ల ఆలయాలకు తరలించి అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించారు. శ్రావణ శుక్రవారం పల్నాటి రణక్షేత్రం కారెంపూడి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. యువకులు ఉత్సాహంగా కుంకుమ బండ్ల ముందు విన్యాసాలు చేస్తూ సందడి చేశారు. గ్రామంలో ప్రతి ఇంటిలో వీర్ల అంకాలమ్మ గ్రామ దేవతల సంస్మరణ సందడి నెలకొంది. మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేసి అమ్మవార్లకు నిష్ఠతో పూజలు చేశారు.

జూలకల్లులో క్షుద్ర పూజలంటూ పుకార్లు

పిడుగురాళ్ల రూరల్: జూలకల్లు గ్రామంలో క్షుద్ర పూజలంటూ పుకారులు వచ్చాయి. గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పొలం పనులకు వెళ్తుండగా దారిలో బొమ్మలు కనిపించటంతో ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే అక్కడ బొమ్మలు మాత్రమే ఉన్నాయి. ఎవరు లేకపోవటం కొంత సమయం వేచి చూశారు. వెంటనే కారంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఓ పశువుల కాపరి పోలీసులు ఉన్న ప్రదేశానికి వచ్చి తమ గ్రామ ప్రజలమంతా సత్యమ్మ, మహాలక్ష్మమ్మ కొలుపుల జాతర నిర్వహించామని గ్రామ పొలిమేరలో ఇలాగా అమ్మవారి విగ్రహాలను చేస్తామని వివరించాడు. ఎస్‌ఐ రబ్బానీ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి క్షుద్రపూజలు చేయలేదని చెప్పారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రబ్బానీ ఖాన్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి

రైల్వే ప్రయాణికులకు తగిన రక్షణ

పిడుగురాళ్ల: ప్రయాణికులకు దొంగల నుంచి రక్షణ చర్యలు వేగవంతం చేస్తామని ఆర్‌పీఎఫ్ సీఐ నాగార్జునరావు అన్నారు. పట్టణంలోని ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో దొంగతనానికి సంబంధించి నేరాల గురించి చర్చించటంతోపాటు ప్రయాణికుల వస్తువులు, రాళ్లదాడి ఘటనలు, అక్రమ మద్యం, నిషేధిత వస్తువులు రైళ్లు, రైల్వే ప్రాంతంలో ప్రత్యేకించి పిడుగురాళ్ల పోస్టు అధికార పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలలో అక్రమంగా రవాణా చేయబడుతున్నాయని వారు తెలియజేశారు. మాదక ద్రవ్యాలు, రైల్వే ఉద్యోగిపై దాడి, మానవ అక్రమ రవాణా, రైళ్లు, రైల్వేలలో మహిళా ప్రయాణికులపై నేరాల గురించి చర్చించటం జరిగిందన్నారు.



ఎస్ఈబీ సీఐ కొండారెడ్డితో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ నాగార్జునరావు

బీసీ కులాలు ఐక్యంగా ఉండాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో బీసీ మండల్ జయంతిని బీసీ కులాల ఐక్యవేదిక పల్నాడు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ మండల్ 40 సిఫారసులు తప్పకుండా అమలు చేయాలని, బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ నల్లమోతు రాజు, కో కన్వీనర్ డి.ఏడుకొండలు యాదవ్, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు హనుమంతరావు, దామోర్ల పట్టాభి, దళిత మహాసభ నాయకులు పిల్లి చెన్నారావు, నల్ల మేస్త్రీ, నూర్ బాషా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల ఖాశీం సైదా, నూర్ బాషా సంఘం యూత్ నాయకులు దూదేకుల సలీం, సీపీఎం మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీను, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణ, మైనార్టీ నాయకులు లాల్ బాషా, మదీన, బీసీ నాయకులు కంభంపాటి రాము, దేశబోయిన బాల కృష్ణ, జి. సంగీతరావు పాల్గొన్నారు.



బీసీ కులాల ఐక్యవేదికలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

నకరికల్లు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలోని నిరుద్యోగులకు ఉచిత భోజనం, ఉచిత హాస్టల్ వసతితో కూడిన శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జాబ్స్ రిసోర్స్ పర్సన్ వై.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. 2018 నుంచి 2023 వరకు వంద పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబంలో సభ్యులు పదో తరగతి పాసై ఉండి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. రూ.15 వేలు నుంచి రూ.25వేల వేతనం, సంస్థ నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో కామన్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ కోర్సు, కంప్యూటర్ టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్ అదనంగా నేర్పిస్తారని అన్నారు.